ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సముద్ర ఉత్పత్తులకు తీవ్ర దెబ్బ



- విశాఖపై ట్రంపు సుంకాల ప్రభావం
- రాష్ట్రం నుంచి అమెరికాకు ఏటా రూ.25 వేల కోట్ల వ్యాపారం
- 50 శాతం టారిఫ్‌లతో ఎగుమతి చేసే కంపెనీలను మూతబెట్టుకోవాల్సిందే !
- సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ వెల్లడి
- పెద్ద సంఖ్యలో రోడ్డున పడనున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపు నిర్ణయం రాష్ట్రంపైనా, అందునా విశాఖపైనా ప్రభావం చూపనుంది. రాష్ట్రం నుంచి ఏటా జరిగే రూ.25 వేల కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర దెబ్బ పడనుంది. అమెరికాతో కోస్తా జిల్లాలు, ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం నుంచి కోట్ల వ్యాపారం నడుస్తోంది. సముద్ర ఉత్పత్తుల రంగ నిపుణులు, వ్యాపారులు చెబుతున్న ప్రకారం.. ఏకంగా 50 శాతం సుంకాల విధింపు నిర్ణయం రాష్ట్రంలోని చేపలు, రొయ్యల ఉత్పత్తులు, ఎగుమతుల కంపెనీలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. లక్షల మంది ఉద్యోగులను రోడ్డున పడేలా చేస్తుంది. 'ఒక్క ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తులపైనే రూ.12,500 కోట్ల భారం తాజా సుంకాల వడ్డింపు వల్ల ఉంటుంది. ఇది ఇక్కడితో ఆగదు. రాష్ట్రంలోని ఆయా సీ ఫుడ్ కంపెనీల్లో పనిచేసే లక్షల మంది సిబ్బందిని రోడ్డున పడేలా చేస్తుంది' అని విశాఖపట్నానికి చెందిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల కంపెనీ రాష్ట్ర నాయకులు ఆనంద్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈ సుంకాల పెంపు ద్వారా మన దేశం నుంచి ఎగుమతి చేసే వస్తువుల ధర ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల కంటే అధికంగా ఉంటుందని, దీనివల్ల మన ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన ఆందోళన చెందారు.

'ట్రంప్ సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థను నెల రోజులుగా భారీ కుదుపునకు గురిచేశాయి. మన దేశం నుంచి అన్ని రకాల వస్తువులు కలిపి ప్రస్తుతం ఏటా 90 బిలియన్ల వరకూ ఎగుమతులు అమెరికాకు జరుగుతున్నాయి. వీటిల్లో ఒక్క ఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ మీద మాత్రమే ఈ సుంకాలు లేవు. దేశంపై 50 శాతం సుంకాల భారం అమలైతే ఎగుమతి సందర్భంలో రూ.4.50 లక్షల కోట్లను మనం సుంకంగా చెల్లించాల్సి ఉంటుంది' అని సంధ్యా ఆక్వా సీ ఫుడ్ ఎగుమతి సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఇది దేశంలో కోటి మంది ఉద్యోగులను రోడ్డుపై భవిష్యత్తులో పడేయనుంది.

వ్యాపారుల్లో ఆందోళన

ఈ సుంకాలు మిగతా 2లో..



జగదాంబ జంక్షన్ నుంచి విశాఖ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

'ఉక్కు'పై మహా ధర్నా

- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- ఇఒఐలు రద్దు చేయాలని నినాదాల హోరు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రకటించిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ)లను రద్దు చేయాలంటూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేపట్టారు. తొలుత జగదాంబ జంక్షన్ నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడారు. ఉక్కును ప్రైవేటీకరించే కుట్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు సాధించాల్సిన కూటమి ఎంపీలు, ముఖ్యంగా విశాఖ ఎంపీ శ్రీభరత్ మిగతా 2లో..

యూరియా కోసం అవస్థలు

వార్త 5లో..

5న లా వర్సిటీ స్నాతకోత్సవం

వార్త 2లో..

యుద్ధప్రాతిపదికన వంతెనల నిర్మాణం చేయాలి

వార్త 5లో..

5న విశాఖకు చంద్రబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5న విశాఖలో జరగనున్న ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు రానున్నారు. ఈ మేరకు బుధవారం షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు ఉదయం 7:30 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుండి చంద్రబాబు బయలుదేరి 8.50 గంటలకు రుషికొండ వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు. 8.55 గంటలకు హెలీపాడ్ నుండి బయలుదేరి 9 గంటలకు రుషికొండ సమీపంలోని రాడిసిన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. అనంతరం 10 గంటల నుండి 11.30 గంటల వరకు ఎసిఐఎం ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. అనంతరం 11:30 గంటలకు రాడిసన్ బ్లూ హోటల్ నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి 11.35 గంటలకు రుషికొండ హెలీపాడ్‌కు చేరుకుంటారు. అనంతరం ఉండవల్లిలోని ఆయన నివాసానికి వెళ్తారు.

ఏర్పాట్ల పరిశీలన

సిఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి పరిశీలించారు. రుషికొండ హెలీపాడ్‌ను సందర్శించారు.

రోడ్డు నిర్వాసితులకిచ్చిన

నోటీసులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - విశాఖపట్నం : అనకాపల్లి - అచ్చుతాపురం రోడ్డు విస్తరణ బాధితులకు విఎంఆర్‌డిఎ అధికారులు ఇచ్చిన నోటీసులను తక్షణం ఉపసంహరించుకోవాలంటూ విశాఖలోని విఎంఆర్‌డిఎ కార్యాలయం ఎదుట నిర్వాసితులు బుధవారం ధర్నా నిర్వహించారు. విఎంఆర్‌డిఎ సెక్రటరీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. విఎంఆర్‌డిఎ అధికారులు టిడిఆర్‌లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని వారి వెబ్ సైట్‌లో తేదీ లేకుండా నోటీసు పెట్టారని, దాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని పెద్ద పెట్టున నినదించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నిర్వాసితుల సంఘం కో - కన్వీనర్ కె.రామ సదాశివరావు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూములు, స్థలాలు, ఇళ్ళు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు వద్దని ఇప్పటికే బాధితులు స్పష్టం చేశారన్నారు. గ్రామాల్లో ఆర్‌డిఒ, విఎంఆర్‌డిఎ అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేయగా నిర్వాసితులంతా టిడిఆర్‌లు వద్దని వినతి పత్రాలు ఇచ్చి అభిప్రాయాలు తెలియజేసిన విషయాన్ని గుర్తుచేశారు. మళ్లీ విఎంఆర్‌డిఎ అధికారులు అభ్యంతరాలు తెలియజేయాలని సూచించడం చట్ట విరుద్ధమన్నారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రెవెన్యూ గ్రామాల వారీగా 16000 నుంచి 25000 గజానికి పరిహారం ఇస్తామని చెప్పి బ్యాంక్ అకౌంట్లు, ఆధార్ కార్డులు సేకరించారన్నారు. ఇప్పుడు టిడిఆర్ పేరుతో నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తున్నా రన్నారు. ఎట్టి పరిస్థితుల్లో టిడిఆర్‌లకు అంగీకరించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. భూములు, మిగతా 2లో..



నినాదాలు చేస్తున్న రోడ్డు విస్తరణ బాధితులు



మొదటి పేజీ తరువాయి..

సముద్ర ఉత్పత్తులకు తీవ్ర దెబ్బ

అమలు పూర్తిగా దేశ, రాష్ట్ర ఎగుమతులను పడుకోబెట్టేస్తాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఏవైనా వస్తువులను దిగుమతి చేసుకోవాలంటే విదేశీ మారక నిల్వల కొరతను దేశం ఎదుర్కొంటుంది. ప్రస్తుత అంతర్జాతీయ ట్రేడ్ టారిఫ్ నేపథ్యంలో అమెరికాతో 15 శాతం డ్యూటీకి యూరోపియన్ యూనియన్ డీల్ కుదుర్చుకోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి డీల్ జరగకపోతే భారతదేశం నష్టపోతుందని చెబుతున్న సీ ఫుడ్ ఎక్స్‌పోర్ట్ సంస్థలు విశాఖ నుంచి తమ వాణి వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి.

'ఉక్కు'పై మహా ధర్నా

ఆ విషయాన్ని విస్మరించి ప్రయివేటు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కేంద్రాన్ని కోరడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పట్ల వారికి చిత్తశుద్ధి లేదన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి లేదా సెయిల్‌లో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం కూడలిలో నడిచిన దీక్షా శిబిరంపై రాష్ట్ర పోలీసుల తీరు దుర్మార్గంగా ఉందన్నారు. దీక్షా శిబిరం ఏర్పాటును నిరాకరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుందన్నారు. ఉక్కుపై అనేక వాగ్దానాలు ఇచ్చి గెలిచిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాత గాజువాకలో నిరసనలు జరగకుండా పోలీసుల ద్వారా ఆటంకపరచడం తగదన్నారు. ప్లాంట్‌లో సంవత్సర కాలంగా ఉద్యోగులకు, కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించడం లేదన్నారు. కార్మికుల జీతాల నుండి రికవరీ చేసిన సంక్షేమ నిధులను సంబంధిత ప్రభుత్వ విభాగాలకు పూర్తిగా జమచేయడం లేదన్నారు. ఉత్పత్తి కారకులైన వారిని ఆర్థికంగా దెబ్బతీయడం సబబు కాదన్నారు. వారంతట వారు విఆర్ఎస్ పెట్టి బయటకు పోయేలా ప్రభుత్వం చేస్తోందన్నారు. ఉక్కు నిర్వాసితులకు ప్రభుత్వం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేసిన అన్యాయాన్ని వివరించారు. చంద్రబాబు, పవన్‌లు స్టీల్‌ప్లాంట్ రక్షణకు చిత్తశుద్ధితో పనిచేయకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎం.మన్మధరావు, బి.నాగభూషణం అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు రవి, కె.దేవసహాయం, ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి, ఎంఎ.బేగం, పుష్పలత, యుఎస్ఎన్.రాజు, ఎస్.శ్రావణ్ కుమార్, కె.అచ్యుతరావు, వెంకటరమణ, నాగరాజు, పి.మణి, బి.జగన్, ఎం.సుబ్బారావు, ఎస్.జ్యోతీశ్వరరావు, ఎస్‌కె.రెహమాన్, అచ్యుతరావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు ఎస్.రామారావు, పివిఎస్‌బి. శ్రీనివాసరాజు, నమ్మి రమణ, కె.రామకృష్ణ, కె.సురేష్, పి.వెంకటరెడ్డి, యు.రాజు, టి.నూకరాజు, జి.నాయనబాబు, వి.లక్ష్మునాయుడు, కెఎస్ఎన్.రాజు, ఎం.చంటి పాల్గొన్నారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి

స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీమిని వెంకటేశ్వరరావు, రాజన్న సన్యాసినాయుడు, తనకాల జగ్గారావు, బొడ్డేడ చిన అప్పలనాయుడు, జి.వెంకట్ లోకనాథం, మాడం సూరప్పారావు, నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్ రాము, రైతు సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

హైర్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వాల్తేర్, సింహచలం డిపోల హైర్‌బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని ఎపిఎస్ ఆర్టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జగ్గప్పారావు (శివ) డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా హైర్ బస్ డ్రైవర్ల జిల్లా కమిటీ సమావేశం బుధవారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో శివ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హైర్ బస్ డ్రైవర్ల వేతనాలు అగ్రిమెంట్ పూర్తయి 10 నెలలు కావస్తోందని, బస్సు యజమానులు వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. తక్షణం అద్దెబస్సు డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్‌ఐతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి నెల 5 న జీతాలు ఇవ్వాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫారం, ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. వాల్తేర్, సింహచలం డిపోలోని హైర్ డ్రైవర్ల సమస్యలు బస్సు యజమానులు, ఆర్టీసీ యాజమాన్యం పరిష్కారం చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, నాయకులు వి.కృష్ణారావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు సీతాలక్ష్మి, అద్దె బస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బెంటాల్స్ శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారని యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ విక్రమ్ రెడ్డి ఐరా తెలిపారు. బుధవారం మేఘాలయహోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28 ఏళ్ల పేషెంట్ ఉరిటి అనిల్ కుమార్‌కు బెంటాల్స్ శస్త్రచికిత్సను నిర్వహించారన్నారు. రోగికి డైలేటెడ్ హార్ట్ చాంబర్ సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. యశోద హాస్పిటల్ అసోసియేట్ కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జరీ డాక్టర్ శివశంకరరెడ్డి తలపరెడ్డి బృందంతో కలిసి శస్త్రచికిత్స నిర్వహించినట్లు వివరించారు. కోలుకున్న అనీల్‌కుమార్ మాట్లాడుతూ యశోద హాస్పిటల్ వైద్యులు చక్కటి చికిత్స అందించి ప్రాణం పోశారని తెలిపారు.

5న లా వర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం సంయుక్త (8వ, 9వ, 10వ, 11వ, 12వ) స్నాతకోత్సవం ఈ నెల 5న జరుగనుందని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.సూర్యప్రకాశరావు తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవోటెల్ హోటల్‌లో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీ నరసింహ, జస్టిస్ జెకె.మహేశ్వరి అతిథులుగా విచ్చేస్తారని తెలిపారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఆర్‌టిజి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక అతిథిగా విచ్చేస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారన్నారు.

నూతన భవనాల ప్రారంభోత్సవం

డిఎస్ఎన్ఎల్‌యులోని నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్ అండ్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర భవనాలను అదే రోజు సాయంత్రం 4:30 గంటలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్.నరసింహ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రారంభిస్తారన్నారు.

సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీ బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబును వినతిపత్రం అందజేసింది. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. వసతి, మెస్ బిల్లులు చెల్లించని పక్షంలో వసతిగృహాల్లో భోజనం నిలిపివేయడం వంటి దుర్మార్గ చర్యలను ఆపివేయాలన్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులపైనా, వారి తల్లిదండ్రులపైనా ఆర్థిక భారం మోపుతూ వసతికి, భోజనానికి వారి దగ్గర నుంచి నగదు సేకరించరాదన్నారు. వసతి గృహాల్లో ఇంటర్నెట్ సదుపాయాన్ని పునరుద్ధరించాలని, బాలికల వసతిగృహంలో సరిపడా గదులు కేటాయించాలని కోరారు. భద్రత కల్పించాలన్నారు. బాటనీ డిపార్ట్‌మెంట్ నుండి గ్రంథాలయానికి, గర్ల్స్ హాస్టల్‌కు వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పోటీ పరీక్షలకు శిక్షణా తరగతులు నిర్వహించాలని కోరారు. మెయిన్ లైబ్రరీలో అన్ని సబ్జెక్టులకు చెందిన పుస్తకాలు, దిన పత్రికలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. యూనివర్సిటీ క్యాంటీన్ ఆహార పదార్థాల రేట్లు సగానికి పైగా తగ్గించాలని, ప్రధాన క్యాంటీన్ వెంటనే ప్రారంభించాలని, భోజనం ధర రూ.25 ఉండేలా చూడాలని కోరారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కుసుమాంజలి, డి.వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ముగిసిన నావల్ మెడికల్ యూనిట్ ఎన్‌సిసి శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 395 మంది ఎన్సీసీ క్యాడెట్లకు 10 రోజులపాటు నిర్వహించిన కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ (సిఎటిసి) ఐఎన్ఎస్ విశ్వకర్మలో విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరాన్ని 4(ఎ) నావల్ మెడికల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ సర్జన్ కమాండర్ ఎ.నరసింహారావు నేతృత్వంలో నిర్వహించారు. ఈ శిబిరంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుండి వచ్చిన క్యాడెట్లు క్రమశిక్షణ, డ్రిల్, యోగా, శారీరక సహనశక్తి, కమ్యూనికేషన్, నావిగేషన్, చిన్న ఆయుధాల వాడకం, ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్, నావల్ ఓరియంటేషన్ తదితర అంశాల్లో కఠినమైన శిక్షణ పొందారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. ఎన్సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ విశాఖపట్నం గ్రూప్ కమాండర్ కమడోర్ సుమంత రాయ్ మాట్లాడారు.

మల్టీ డిసిప్లినరీ శిక్షణా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని మర్రిపాలెం మల్టీ-డిసిప్లినరీ శిక్షణ కేంద్రాన్ని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా బుధవారం తనిఖీ చేసి, లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, రైలు మేనేజర్లకు ఇస్తున్న శిక్షణ కార్యకలాపాలను సమీక్షించారు. శిక్షణార్థులతో సంభాషించి, వారి వత్తిపరమైన విధుల్లో అత్యున్నత ప్రమాణాలు నిబద్ధతను కాపాడుకోవాలని ప్రోత్సహించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఉత్తమ కేంద్రంగా కెజిహెచ్ ఎన్ఆర్‌సి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని ఎన్ఆర్‌సి కేంద్రం రాష్ట్రంలోనే ఉత్తమమైనదిగా గుర్తింపు పొందిందని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి 7 వరకు జరుగుతున్న పోషకాహార వారోత్సవాలు భాగంగా కెజిహెచ్ పిల్లల విభాగానికి అనుబంధంగా న్యూట్రిషినల్ రిహబిలిటేషన్ సెంటర్‌లో బుధవారం నేషనల్ న్యూట్రిషన్ వీక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య విభాగానికి చెందిన విభాగాధిపతి డాక్టర్ బిఎస్.చక్రవర్తి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం చాలా ముఖ్యమన్నారు. రాష్ట్రస్థాయిలో కెజిహెచ్ ఎన్ఆర్‌సి. కేంద్రానికి ఉత్తమమైనదిగా గుర్తింపు లభించడం గర్వకారణమన్నారు.

డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలక్టరేట్: ఆంధ్రా మెడికల్ కళాశాలలో మైక్రోబయాలజీ విభాగంలో పునరుద్ధరించబడిన వైరస్ పరిశోధన, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను ఎఎంసి ప్రిన్సిపాల్, అదనపు డిఎంఈ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి, అదనపు డిఎంఇ, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసిన్ హెచ్ఒడి డాక్టర్ డి.రాధాకృష్ణన్, అదనపు డైరెక్టర్ లోగనాథన్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ సి.శివకళ్యాణి, మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు బుధవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ వైరల్ వ్యాధులకు సిరోలాజికల్, మోలిక్యులర్ డయాగ్నోస్టిక్స్ పరీక్షలు రోగుల సంరక్షణ కోసం వివర్ డిఎల్ ల్యాబ్‌లో నిర్వహిస్తారని తెలిపారు.

అయోమయంలో జగన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పులివెందుల జెడ్‌పిటిసి ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయంతో అయోమయంలో ఉన్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలో వైయస్సార్ సమాధి వద్ద నివాళులర్పించిన జగన్మోహన్‌రెడ్డి అక్కడి పల్లె ప్రాంతంలో రోడ్డు షో చేయడం దారుణమన్నారు.

IN THE HONOURABLE COURT OF II ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S. 311/2023

Between:
M/S. AS Steel Traders (VSP) Pvt.Ltd.
Rep. by its Director Sri A.Mahesh
... Plaintiff

And:
1. Vishwanadh Avenues (India) Pvt. Ltd., Rep. by its Director Sri Boddeti Narendra Kumar
2. Boddeti Kasi Vishwanadham Chairman M/s Vishwanadh Avenues (India) Pvt. Ltd., ... Defendants

PUBLIC NOTICE TO DEFENDANT NO. 2
To,
Boddeti Kasi Vishwanadham
S/o. not known to the plaintiff, Chairman M/s Vishwanadh Avenues (India) Pvt. Ltd., Hindu, Business, aged around 60 years, office at 5th Floor, Zudio Building, Beside Omni RK Hospital, Ramnagar, Visakhapatnam.

Please take notice that the above O.S.311/2023 filed by the plaintiff company against you for recovery of money under ledger account. The above matter stands posted to **22.09.2025** for your appearance. You are hereby summoned to appear either in person or through an Advocate before the Hon'ble II Addl. Senior Civil Judge Court, Visakhapatnam at **10.30 A.M on 22.09.2025** failing which, the matter will be decided exparte in your absence.

(By Order of the Hon'ble Court)
Sri R.SRINIVASA RAO,
ADVOCATE
Visakhapatnam-530 002.
Cell: 9441343837
Visakhapatnam,
Dt.01.09.2025

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 382/2024

బిట్వీన్:
దాసరి రాము .... వాది
అండ్:
తలశిల వెంకటేశ్వరరావు మరియు ఇతరులు .... ప్రతివాదులు

ప్రతివాది-2:
గుట్ట సురేష్, తండ్రి పాండురంగారావు, C/o. శ్రీ రాఘవేంద్ర నిలయం, శివ సాయి నగర్, రోడ్ నెంబర్ -1, డో.నెం.31-2-34, F-2, కుర్మన్నపాలెం గాజువాక మండలం, విశాఖపట్నం-531046

ప్రతివాది-4:
చింతపల్లి పుష్పలత, W/o. ప్రసాద్, డోర్ నెంబర్. 3-4-26, అట్నూరు, ఉంగుటూరు మండలం, కృష్ణ జిల్లా.

పై నంబర్ గల దావాలో వాది ప్రతివాదులు పై దావ పరిహారం కోరుతూ దావా దాఖలు చేసినందున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **తేదీ 17-09-2025** వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు **ఉదయం 10:30 నిముషాలకు** హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షంగా పై దావాలో తీర్మానించుదురు.

By Order of the Honourable Court
అనకాపల్లి **డి.మల్లేశ్వరరావు**
తేది 4-09-2025 అడ్వకేట్, అనకాపల్లి

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I. A. No. 539/2024 in O.S. 382/2024

బిట్వీన్:
దాసరి రాము ... పిటిషనర్ / వాది
అండ్:
తలశిల వెంకటేశ్వరరావు మరియు ఇతరులు .... రెస్పాండెంట్ / ప్రతివాదులు

ప్రతివాది-2:
గుట్ట సురేష్, తండ్రి పాండురంగారావు, C/o. శ్రీ రాఘవేంద్ర నిలయం, శివ సాయి నగర్, రోడ్ నెంబర్ -1, డో.నెం.31-2-34, F-2, కుర్మన్నపాలెం గాజువాక మండలం, విశాఖపట్నం-531046

ప్రతివాది-4:
చింతపల్లి పుష్పలత, W/o. ప్రసాద్, డోర్ నెంబర్. 3-4-26, అట్నూరు, ఉంగుటూరు మండలం, కృష్ణ జిల్లా.

పై నంబర్ గల పిటిషన్లో పిటిషనర్ పరిహారం కోరుతూ పిటిషన్ దాఖలు చేసినందున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **తేదీ 17-09-2025** వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు **ఉదయం 10:30 నిముషాలకు** హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షంగా పై పిటిషన్ లో తీర్మానించుదురు.

By Order of the Honourable Court
అనకాపల్లి **డి.మల్లేశ్వరరావు**
తేది 4-09-2025 అడ్వకేట్, అనకాపల్లి

నోటీసు
మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారికి
I.A. No.324/2025 in O.S. 61 / 2025

Between :
1) పుల్లగూర రాజా
2) పుల్లగూర రక్షిత్
మైనర్లు అయినందున గార్డియన్ తల్లి పుల్లగూర మౌనిక .... వాదులు
Vs
పుల్లగూర సుధీర్ మరియు ముగ్గురు .... ప్రతివాదులు
To,
1) Defendant No.4 /Respondent No.4 – పుల్లగూర ఇందిర W/o మామిళ్ళపల్లి నాగభూషణం, వయస్సు 39 సం॥లు, నివాసము యన్.ఏ.డి. జంక్షన్, గోపాలపట్నం రోడ్డు, విశాఖపట్నం టౌన్ & జిల్లా.

పై నెంబరు దావాలో మీరు 4వ ప్రతివాది అయి ఉన్నారు. మీపై మరియు ముగ్గురు ప్రతివాదులపై జాయింటు కుటుంబ ఆస్తి భాగపంపిణీ కోసం మీపై వాదులు దావా దాఖలు చేసియున్నారు. దావాతో పాటుగా జాయింటు కుటుంబ ఆస్తులను వాదులకు తెలియకుండా ఎటువంటి క్రయ విక్రయములు జరుపకుండా ఐ.ఏ.నెం. 324/2025 గా ఇంజక్షన్ దాఖలు చేసియున్నారు. పై నెంబరు దావాలో మరియు ఐ.ఏ. పిటిషన్లో 4వ ప్రతివాది అయిన మీకు నోటీసులు శ్రీ కోర్టు వారి ద్వారా పంపగా, మీకు ముట్టనందున, మీకు ఈ పేపరు నోటీసు నిమిత్తమై, శ్రీకోర్టువారు ది.08-09-2025 వ తేదీకి వాయిదా వేసినారు. వాయిదా రోజు ఉ॥ 10-30 ని॥ లకు, మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా ప్లీడరు గారి ద్వారాగాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న తెలుపు కోవలసినది. లేనియెడల, మీ పరోక్షమందు, విచారించి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా తేది. 08-09-2025

ఇట్లు
శ్రీ కె.యస్.ఆర్. ఆంజనేయులు,
వి. గోపిరాజు,
పిటీషనర్ తరుపు అడ్వకేట్,
నరసరావుపేట. సెల్. 9390511530

చెరువులకు నీరు అందేలా చర్యలు

ఆనందపురం మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



మండల సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఎంఆర్‌జిఎస్ పథకం ద్వారా కాలువల మరమ్మతులు చేపట్టి చెరువులకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆనందపురం మండల సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. ఆనందపురం మండల పరిషత్ సర్వసభ సమావేశం బుధవారం ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన, ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి ఆధ్వర్యాన నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై సమస్యలను చర్చించారు. వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ రైతు భరోసాపై రిపోర్టు సమర్పించగా, సర్పంచ్ ముకుందపురం గంగరాజు లేచి మాట్లాడుతూ రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు, ముఖ్యంగా యూరియా అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వైస్ ఎంపిపి, గంభీరం ఎంపిటిసి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ మాట్లాడుతూ, గంభీరం సర్వే నెంబర్ 173లో గెడ్డవాగు కబ్జాకు గురై ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. జగనన్న కాలనీ సమీపంలో కూడా ఇలాంటి సమస్యలు ఉన్నాయని వివరించారు. బోని సర్పంచ్ అప్పలకొండ సన్యాసప్పడు మాట్లాడుతూ, ఇనాం భూముల సర్వే పూర్తయి ఏడాది గడిచినా పట్టాలు ఇవ్వలేదన్నారు. సింహాచలం పద్మనాభం రోడ్డులో బోని కూడలివద్ద మహిళలకు ఉచిత బస్సు ఆగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. లోడగలవానిపాలెం సర్పంచ్ రాజేశ్వరి రమణ మాట్లాడుతూ, ఆనందపురం-లోడగలవానిపాలెం పంచాయతీల సరిహద్దులు తేలక అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, కలెక్టర్ జోక్యం చేసుకుని పరిష్కరించాలని కోరారు.

తహశీల్దార్ శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రస్తుతం 6 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని, రెవెన్యూ సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వేములవలస పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు మాట్లాడుతూ, బీపీ కల్లాల్లో రీ సర్వే పూర్తయినా భూహద్దుల్లో రాళ్లు వేయలేదని, అక్కడి పాఠశాల అధ్వాన స్థితిలో ఉందని తెలిపారు. స్థలం కేటాయించినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, పిఎసిఎస్ చైర్మన్ గన్‌రెడ్డి సోంబాబు, పాండ్రంకి అప్పలరాజు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



బీరువాను అందజేస్తున్న అధ్యాపకులు స్వర్ణలత

బీరువా వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అదే కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ బి.స్వర్ణలత తన సొంత నిధులతో సమకూర్చిన గోద్రెజ్ బీరువాను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి మాట్లాడుతూ, కళాశాలకు చెందిన రికార్డులు, ఫైళ్లు భద్రపర్చుకునేందుకు ఈ బీరువా ఉపయోగపడుతుందన్నారు. బీరువాను అందజేసినందుకు లెక్చరర్ స్వర్ణలతను ప్రిన్సిపల్, సహచర అధ్యాపకులు అభినందించారు.

హత్య కేసులో నిందితునికి యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి- విశాఖ లీగల్ న్యూస్ : నాగమల్లి శివకృష్ణ హత్య కేసులో ఆటో డ్రైవర్ బుర్కా దుర్గారావుకు కఠిన జీవిత ఖైదు విధిస్తూ రెండో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి సికె.గాయత్రీదేవి తీర్పు నిచ్చారు. కేసుకు సంబంధించి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ఎస్.చంద్రశేఖర్ కథనం ప్రకారం... నిందితుడు దుర్గారావు నుంచి మృతుని తమ్ముడు నాగమల్లి జగదీష్ సీలింగ్ పనుల నిమితం రూ.500 అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. కానీ పనిచేయలేదు. ఈ కారణంగా నిందితుడు తరచుగా జగదీష్‌తో గొడవ పడేవాడు. ఈ క్రమంలో జగదీష్ సోదరుడు నాగమల్లి శివకృష్ణ జోక్యం చేసుకోవడంపై నిందితుడు ద్వేషం పెంచుకున్నాడు. 2016 సెప్టెంబర్ 15వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో పాండవీధి వద్ద శివకృష్ణపై దుర్గారావు కత్తితో దాడి చేశాడు. శివకృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు నాగమల్లి జగదీష్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును అప్పటి సిఐ కె.వెంకటరావు దర్యాప్తు చేసి, ఛార్జిషీటును న్యాయస్థానంలో దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై అభియోగాలు నిర్ధారణ కావడంతో దుర్గారావుకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.3 లక్షల పరిహారాన్ని మృతుని కుటుంబానికి చెల్లించాలని పేర్కొన్నారు. డిఫాల్ట్ చేసిన పక్షంలో ఒక సంవత్సరం సరళ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

అక్టోబర్ 7 నుంచి మూట్ కోర్టు పోటీలు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన అక్టోబర్ 7 నుంచి 10వ తేదీ వరకు న్యాయ విద్యార్థులకు జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు వర్చ్యువల్‌గా నిర్వహిస్తున్నట్లు డైరక్టర్ డాక్టర్ సిహెచ్.లక్ష్మణరావు తెలిపారు. గీతం మూట్, అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలో గీతం వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి పేరుతో గత ఐదేళ్లుగా క్రమం తప్పకుండా ఈ పోటీలను ప్రముఖ న్యాయ నిపుణల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు. న్యాయ వృత్తిలో పాటించాల్సిన మెళకువలపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, న్యాయస్థానంలో వాదోపవాదాలపై వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌డిపిఎస్ కేసులలో ఎదురవుతున్న న్యాయపరమైన సవాళ్లు ముఖ్యంగా క్రిమినల్ లా ఆధారంగా మూట్ కోర్టు పోటీలలో విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి చర్చించాల్సిన అంశంపై గీతం మూట్ కోర్టు పోటీల వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎమ్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని చెప్పారు. ప్రతి న్యాయ కళాశాల నుంచి ముగ్గురు ఒక జట్టుగా మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం mcc.schooloflaw@gitam.edu ను పరిశీలించాలని సూచించారు.

ఎపిపిగా సతీష్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ న్యూస్ : విశాఖపట్నం ఆరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి)గా సవిలి సతీష్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వము జిఒ 328 విడుదలచేసింది. మూడేళ్లపాటు సతీష్‌కుమార్ ఈ సేవలు అందిస్తారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు, ఎంపీ శ్రీభరత్‌కు సతీష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో బుధవారం రెడ్డిపల్లి ఎస్‌బిఐ ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని బ్రాంచి మేనేజర్ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ ఎఎ బషీర్, ఎస్‌బిఐ డిజిఎం రాహుల్ శంక్రిత్యా, ఆర్ఎం అభిషేక్ కుమార్, ఎఫ్ఐ మేనేజర్ రాఘవేంద్ర హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా జూలై 1 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు గ్రామస్థాయి జన సురక్ష, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఈకేవైసీ, నామిని, సైబర్ క్రైమ్‌లపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థాయిలో మహిళా సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామైక్య సంఘాల ప్రతినిధులు కంచమ్మ, లక్ష్మి, లీల తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకుల అధికారులు

ఆనందపురం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన పందలపాకలో బుధవారం మెగా జనసురక్షా ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ బషీర్ మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యత లోపం కారణంగానే సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బులు మోసగాళ్లకు దారి మళ్లకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వ పథకాల డబ్బులు జమకావని, ఖాతాదారులు సమయానికి రీ - కేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉందని, ఖాతాల్లో నామినీ నమోదు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఏవైనా డిజిటల్ మోసాలు జరిగితే వెంటనే సైబర్ సెక్యూరిటీ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం రీజినల్ మేనేజర్ సింహాచలం మాట్లాడుతూ, ప్రజలందరూ ప్రభుత్వ బీమా పథకాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ ఎన్.మధుసూదన్ రెడ్డి, విశాఖ డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, ఏపీజీబీ రీజినల్ హెడ్ చిరంజీవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆనందపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ తిరుపతిరావు, చందక సర్పంచ్ బంక శ్రీను పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఓ ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుచ్చయ్యపేట మెయిన్ రోడ్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కేపీ అగ్రహారం గ్రామానికి చెందిన జొన్నపల్లి ఈశ్వరరావు(55) బుధవారం బుచ్చయ్యపేట మెయిన్ రోడ్‌లో నడిచి వెళుతుండగా వెనుక నుండి వస్తున్న ఓ ప్రైవేటు బస్సు ఆయన్ను ఢీ కొట్టింది. బస్సు వెనుక చక్రాలు ఈశ్వరరావు నడుము పైనుండి వెళ్ళిపోవడంతో శరీరం నుజ్జు నుజ్జు అయి ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు విచారణ చేపట్టారు.

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : భర్త వేధింపులు తట్టుకోలేక మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో బుధవారం ఉదయం పడాల జయ (26) అనే వివాహిత ఇంటి లోపల ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నీలకంఠాపురం గ్రామానికి చెందిన పడాల నర్సింగరావుతో అనకాపల్లి మండలం గోలగాం గ్రామానికి చెందిన జయకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల బాబు, నాలుగేళ్ల పాప ఉన్నారు. భర్త నర్సింగరావు మద్యానికి బానిస కావడంతో కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. భర్త వేధింపులు కారణంగా బుధవారం ఉదయం జయ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు బుచ్చయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌కు గురైన యువతి మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి మండలం తుమ్మపాల గవరపేట వీధికి చెందిన యువతి రమ్య (21) విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతి చెందింది. అదే గ్రామంలో బట్టల షాపులో పనిచేస్తున్న ఆమె గత నెల 30న హెచ్‌డి వైర్ తగలగా గాయపడిన ఆమెను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రమ్య మృతి చెందారు. ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలునిపై దాడి

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం ప్రాంతంలో వినాయకుడి గుడి మండపం వద్ద బాలునిపై మందుబాబులు రాడ్‌తో దాడి చేశారు. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... రామకృష్ణనగర్ ప్రాంతానికి చెందిన వినయ్ (16) మండపం వద్దకు తల్లితో కలిసి వచ్చారు. అక్కడ మద్యం తాగుతున్న మజ్జి విగ్నేశ్వరరావు, మరి కొంతమంది వీరితో వాగ్వాదానికి దిగారు. దీంతో తల్లి కొడుకులిద్దరూ అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. వినయ్ మండపంలో నిద్రించేందుకు మళ్లీ వచ్చాడు. అక్కడే మద్యం మత్తులో ఉన్న విగ్నేశ్వరరావు అతని సోదరుడు కలిసి వినయ్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో విగ్నేశ్వరరావు పక్కన ఉన్న రాడ్‌ను తీసుకుని వినయ్ తలపై బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావమై వినయ్ స్పృహ కోల్పోయాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. వినయ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు.

హైస్కూల్‌ను సందర్శించిన డైట్ అధ్యాపకులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, లక్ష్మీపురం జెడ్‌పి హైస్కూల్‌ను భీమిలి ప్రభుత్వ డైట్ అధ్యాపకులు బుధవారం సందర్శించారు. పలు తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల రాత పుస్తకాలు, ఉపాధ్యాయుల కర దీపిక, డైరీలను పరీక్షించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. డైట్ అధ్యాపక బృందంలో ఎం.వెంకటరమణ, కె.శాంతి, కె.శోభారాణి, వి.వసుంధర ఉన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం డి.సత్యారావు, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న డైట్ అధ్యాపకులు

స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-సీతమ్మధార : స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు కెఎం.కుమారమంగళం, అధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్విగ్గీ, జొమాటో యాజమాన్యాలతో అనేక దఫాలు చర్చలు జరిపినా, లేబర్ కమిషనర్, కలెక్టర్ జోక్యం చేసుకున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. దీంతో ప్రతి శని, ఆదివారాల్లో స్విగ్గీ, జొమాటోను బంద్ చేయాలని రైడర్లు నిర్ణయించినట్లు తెలిపారు. ద్వారకానగర్, ఎంవిపి, ఎన్ఎడి, గాజువాక, మధురవాడ, పెందుర్తి, తగరపువలస జోన్లలో ఉన్న రైడర్లు ఈ బందులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం జిల్లాలో గత 7 సంవత్సరాలుగా స్విగ్గీ, జొమాటో ద్వారా సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు రోజూ సమాజానికి సేవలందిస్తున్నా, వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఉన్నత విద్యను పూర్తి చేసినా, ఉపాధి అవకాశాలు లేక గిగ్ వర్కర్‌గా పనిచేస్తున్నారని చెప్పారు. రోజురోజుకూ పెరిగిపోతున్న జీవన ఖర్చులు, పెట్రోల్ ధరలు, అనిశ్చితమైన ఆదాయం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అక్రమంగా తొలగించిన రైడర్ల ఐడిలను వెంటనే పునరుద్ధరించాలని, సమస్యలుంటే ముందుగా నోటీసు ఇవ్వకుండా, వర్కర్ వాదన లేకుండా అక్రమంగా తొలగించరాదని, మినిమం గ్యారెంటీ ఆదాయం అమలు చేయాలని, ఆన్‌లైన్‌లో పనిచేసే గంటల ప్రాతిపదికన కనీస గ్యారెంటీ అమలుచేయాలని, పీక్ టైం కంపల్సరీ విధానం తగ్గించాలని, ఇన్సెంటివ్ విధానం ఉండాలని డిమాండ్‌చేశారు. ప్రమాదం జరిగినా, కస్టమర్లు దాడి చేసినా కనీస భద్రత లేదని ఆవేదన వ్యక్తంచేశారు.



లేబర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిగ్ వర్కర్లు

కల్లుగీత కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి -మాధవధార : సమస్యలపై ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం మాధవధార శాఖ ఆధ్వర్యంలో విశాఖ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆఫీస్ వద్ద అధ్యక్షులు సంపంగి పోలయ్య అధ్యక్షతన బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కల్లుగీత కార్మికుల సమస్యలపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేవుడు మాట్లాడుతూ, విశాఖ, అనకాపల్లి ఉమ్మడి జిల్లాల్లో కల్లుగీత కార్మికులు సుమారుగా మూడువేల మంది ఉన్నారన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కల్లుగీత వృత్తి అంతరిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. వృత్తి చేయుటకు తాటి, ఈత చెట్లు తగ్గుతున్నాయన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూ దందాలు పెరగడంతో తాటి, ఈత చెట్లు తగ్గాయన్నారు. కల్లుగీత వృత్తిదారుల ఆదాయం తగ్గిందని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కార్మికులకు ఉపాధి కోసం ప్రభుత్వం బ్రాందీ షాపులు కేటాయించినా, బెల్ట్ షాపులను గ్రామాల్లో పెడుతుండటంతో ఆదాయాలకు గండి పడితోందని తెలిపారు. తక్షణమే గ్రామాల్లో బెల్ట్ షాపులు రద్దు చేయాలని, గీత కార్మికులకు సేఫ్టీ మూకులు, ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, కల్లు పాలసీని రూపొందించాలని, ప్రమాదంలో చనిపోయిన గీత కార్మికుల కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.నరసింహారావు, ఎల్.మహాలక్ష్మి, పి.సన్యాసిరావు, జె.సంతోష్, సిహెచ్.అప్పలరాజు, ఎ.కృష్ణ, జి.రాము, వి.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో జివిఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి సుజాతనగర్ పరిధి 80 అడుగుల రోడ్డు ప్రాంతంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం పర్యటించారు. 80 అడుగుల రోడ్డు శివారు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డును పరిశీలించారు. ఆ రోడ్డు పూర్తవకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెదగాడి రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్, ఎఇలు, డిఇలు, జోనల్ కమిషనర్ పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌కు అభినందన సభ

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యాన గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షత్రియ సంక్షేమ సమితి అధ్యక్షులు తిరుపతిరాజు మాట్లాడుతూ పూసపాటి అశోక్ గజపతిరాజు రాజకీయాల్లో వివిధ పదవులు అనుభవించి పదవులకే వన్నె తెచ్చారని కొనియాడారు. మాన్సాస్ ట్రస్టు ద్వారా ఎంతో మంది పేద పిల్లలకు విద్యను అందించారన్నారు. క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ రాజకీయాల్లో ఉండేటప్పుడు క్రమశిక్షణ, నిబద్ధత ఉంటే విలువ పెరుగుతుందన్నారు. అనంతరం పూసపాటి అశోక్ గజపతిరాజును క్షత్రియ సంక్షేమ సమితి సత్కరించారు. జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కెకె.రాజు, బసవరాజు, శివాజీ, పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రతి అధికారీ తమ విభాగాలలో అంకితభావంతో విధులు నిర్వహించాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. జివిఎంసి జోన్-3 కార్యాలయంలో బుధవారం ఆయన జోనల్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలో అభివృద్ధి పనులు మంజూరు, పనుల స్థాయిపై ఆరా తీశారు. మంజూరైన పనులను నిర్ణీత సమయంలో సంబంధిత కాంట్రాక్టర్‌చే త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించకుండా సహాయక ఇంజినీర్లు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. జోన్ పరిధిలో అనధికార కట్టడాలు, వాటిపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయవద్దన్నారు. జోన్ పరిధిలోని ఖాళీ స్థలాల పరిరక్షణకు కృషిచేయాలని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు ఉంటే వెంటనే మొదలుపెట్టేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఆదేశించారు. ప్లాన్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులు రెండు రోజుల కంటే ఎక్కువ కాలం తమ లాగిన్‌లో ఉంచకుండా పైఅధికారులకు పంపించాలన్నారు. ఇప్పటికే రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు తమ లాగిన్‌లో ఉంచుకున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సాయిబాబుతో పాటు ప్లానింగ్ కార్యదర్శి విష్ణు కుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వీధి విక్రయదారుల గుర్తింపు, అన్న క్యాంటీన్లను నిత్యం పరిశీలించాలని యుసిడి అధికారులను ఆదేశించారు. రాత్రి బస ఆశ్రయ కేంద్రాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జోన్ 3 వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి : యుటిఎఫ్


కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- గాజువాక : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) గాజువాక మండల శాఖ ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ఆధ్వర్యాన బుధవారం మండలంలోని శనివాడ, ఉప్పరకాలనీ, అగనంపూడి, అగనంపూడి బిసి కాలనీ, కూర్మన్నపాలెం, చినగంట్యాడ, సింహగిరికాలనీ, కర్ణవానిపాలెంలోని పాఠశాలలను సందర్శించి, సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ గాజువాక మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇమంది ప్రసాద్, సబ్బారపు నూకరాజు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ డిఎలను మంజూరు చేయాలని, ఐఆర్‌ను తక్షణం ప్రకటించాలని, పిఆర్‌సి అమలు చేయాలని, సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాబోధనకు అడ్డంకిగా ఉన్న అనవసరమైన యాప్స్‌ను తొలగించి, ఉపాధ్యాయులను విద్యాబోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో యుటిఎఫ్ మండల నాయకులు నిడదవోలు శ్రీనివాస్‌రాజు, సూరిశెట్టి శ్రీనివాసరావు, కట్టిపోగు మురళీకృష్ణ, డి.నూకరాజు, ప్రధానోపాధ్యాయులు జిఎల్ఎన్.మల్లేశ్వరి, టివి.ప్రేమలత, డి.త్రివిక్రమ్, తస్నీమ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉక్కులో భారీ దొంగతనంపై కలకలం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ దొంగతనం బయటపడింది. అత్యంత భద్రత ఉన్నచోట ఈ దొంగతనం జరగడం ఉక్కు ఉద్యోగుల్లో కలకలం రేపింది. దీనిపై స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... గత నెల 28వ తేదీన బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో కొన్ని స్టాప్ కూలింగ్ కాపర్ ఐటమ్స్ చోరీకి గురయ్యాయని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఫిర్యాదు చేసిందని తెలిపారు. దీని విలువ రూ.25 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నామని, కొందరు అనుమానితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నామని తెలిపారు. త్వరలోనే అసలు నిందితులను పట్టుకుంటామని చెప్పారు. ఈ చోరీలో యూనియన్ నాయకుల ప్రమేయం ఉందని, వారెవరో పోలీసులు బయటపెట్టాలని పలువురు ఉక్కు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి, సిద్ధార్థనగర్‌లో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులకు విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్నాథం శంకుస్థాపన చేశారు. అనంతరం వడ్లపూడి సచివాలయం వద్ద ఎపిఐఐసి నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, నాడు స్టీల్ ప్లాంట్‌ను కాపాడిన చంద్రబాబు నేడు ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఇప్పుడు కూడా ఆయనే విశాఖ ఉక్కును పరిరక్షిస్తారని తెలిపారు. ఆయన కృషి వల్లనే రూ.11,400 కోట్లు మంజూరైందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎపిఐఐసి నిర్వాసితుల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ బొండా జగన్నాధం మాట్లాడుతూ, వార్డులో దీర్ఘకాలంగా ఉన్న గ్రౌండ్ సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులు మంజూరు చేయాలని, మరిన్ని నిధులు ప్రభుత్వం నుండి వచ్చేలా కృషి చేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సాగి విజయరామరాజు, సూరిశెట్టి పెంటారావు, బొట్టా ప్రకాష్, ప్రసాదుల శ్రీను, లక్కరాజు సోమరాజు, బెల్లంకొండ రాజన్ రాజు, నల్లూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 93, 94, 97 వార్డుల్లో రూ.14 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రజలకిచ్చిన హామీలను ఏడాదిలోనే చాలావరకు నెరవేర్చామని తెలిపారు. రాబోయే నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 97వ వార్డు కార్పొరేటర్ వసంత శంకర్రావు, జోనల్ కమిషనర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి ఇందిరానగర్, రాజీవ్‌నగర్, వెటర్నరీ కాలనీల్లో జివిఎంసి నిధులు రూ.73.37 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు, కల్వర్టు పనులకు బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పనులు వేగవంతం చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వర్క్స్ ఎఇ వెంకటరావు, వార్డు టిడిపి అధ్యక్షులు గాదు అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల రాజేష్, తులసీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, స్థానిక కార్పొరేటర్ కంపా హనోక్‌తో కలిసి మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విశాఖ నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. 45వ వార్డు పరిధి లక్ష్మీనారాయణపురం-2 అంగన్వాడీలో రూ.19.40 లక్షలతో రక్షణ గోడ, మరుగుదొడ్డి నిర్మాణం, శివశంకర రజకుల కాలనీలో రూ.18.80 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయిన్లు, నరసింహనగర్‌లో రూ.11 లక్షలతో 600 ఎంఎం సిసి డ్రెయిన్లు మరమ్మతులు, ఎన్‌హెచ్- 16 సర్వీస్ రోడ్డు వాసుదేవనగర్‌లో రూ.18 లక్షలతో విఆర్‌సిసి రిటైనింగ్ వాల్ నిర్మాణం, ఎన్‌హెచ్- 16 నుండి ఎస్ఆర్ నగర్ టాయిలెట్ వరకు రూ.19.85 లక్షలతో ఎస్‌డబ్ల్యు డ్రెయిన్ పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన చేశామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శ్యామలా దీపిక, పైలా ముత్యాల నాయుడు, భరణికాన రాజు, గొలగాని సౌజన్య పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా

యుద్ధప్రాతిపదికన వంతెనల నిర్మాణం చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన పొర్లు దండాలతో వినూత్న నిరసన

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలంలోని తాచేరు, వడ్డాది బ్రిడ్జిలను యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం పొర్లు దండాలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు ఎస్‌వి.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విజయరామరాజు పేట వద్ద తాచేరు నదిపై ఉన్న వంతెన కూలిపోవడం, కాజ్‌వే కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు సాగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు ప్రధాన రోడ్డుగా ఉన్న ఈ మార్గంలో వంతెన కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్నా దానిని పునర్నిర్మించకపోవడం దారుణమన్నారు. తాత్కాలికంగా వేసిన కాజ్‌వే గత నెలలో కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో పాడేరు, మాడుగుల, ఇటు నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, విశాఖపట్నం వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. అటు చీడికాడ వైపు, ఇటు గౌరీపట్నం మీదుగా సుదీర్ఘంగా ప్రయాణం సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిఎన్ రోడ్డు అధ్వానంపై లాయర్లు కోర్టులో కేసు వేయగా, న్యాయమూర్తులు ప్రభుత్వానికి, అధికారులకు చివాట్లు పెట్టిందని, అయినా ప్రభుత్వానికి సిగ్గు రాలేదన్నారు. అనకాపల్లి మార్గంలో అనేక బ్రిడ్జిలు శిథిలావస్థలో ఉన్నాయని, గోవాడ వద్ద శారదా నదిపై బ్రిడ్జి ప్రమాద స్థాయిలో ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనల పునర్నిర్మాణం చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


పొర్లు దండం పెడుతూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

సరిపడా బస్సులు నడపాలని ఐద్వా నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సరిపడా బస్సులు వేయాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధర్యంలో బుధవారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, కార్యదర్శి డిడి.వరలక్ష్మి, కోశాధికారి కెవి. సూర్యప్రభ మాట్లాడుతూ స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణాల వలన రద్దీ విపరీతంగా పెరిగిందని, విద్యార్థులు కాలేజీకి వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల సకాలంలో కాలేజీకి వెళ్లలేకపోతున్నారన్నారు. మహిళలు బస్సుల్లో కూర్చోవడానికి సీట్లు లేక ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ప్రయాణిలకుల రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. లేకుంటే ఐద్వా ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

డ్రోన్లతో పిచికారీ లాభదాయకం

ప్రజాశక్తి-కోటవురట్ల : డ్రోన్ సహాయంతో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకుంటే రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజిని అన్నారు. మండలంలోని బికె.పల్లి గ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు లింగం నాయుడు చేతుల డ్రోన్ సహాయంతో ఎరువుల పిచికారీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'లోకేష్‌కు ఆహ్వానం ఎపికి దక్కిన గౌరవం'

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : రాష్ట్ర విద్య, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెషల్ విద్యుత్ ప్రోగ్రాంలో పాల్గొనాలని ఆహ్వానం రావడం ఆంధ్రప్రదేశ్‌కి దక్కిన అరుదైన గౌరవమని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో ఉన్న ఆస్ట్రేలియా హైకమిషనర్ లోకేష్‌కు ఆహ్వానం పత్రం పంపినట్లు తెలిపారు.

ఫిట్‌నెస్ పరికరాలకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫిట్నెస్ పరికరాలు పాడైపోయిన నేపథ్యంలో తక్షణమే వాటి మరమ్మతులు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజు, ఐక్య వేదిక నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, కొల్లి చిన్న అప్పారావు, ఆడారి బుచ్చిరాము, వాసుపల్లి తాతయ్యలు తదితరులు బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఫిట్నెస్ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యంత్రాలు తుప్పు పట్టి స్క్రూలు లూజ్ అయిపోయి పరికరాలు వాడడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి పాడైపోయిన ఫిట్నెస్ యంత్రాలను మరమ్మతులు చేయాలని కోరారు.

బియ్యం వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : వినాయక నవరాత్రి వేడుకలలో భాగంగా నర్సింగరావుపేటలో సిద్ధి వినాయక సంఘం వారు నిర్వహించబోయే అన్న సమారాధన కార్యక్రమానికి ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరావు తనయుడు ముత్యాల రాజేష్ తమ వంతు సహాయంగా బియ్యం బస్తాలను తమ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాల రాజేష్ మాట్లాడుతూ గణపతి భక్తులకు ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అన్నసమారాధనకు తమ వంతు సహాయం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.



బియ్యం బస్తాలు అందిస్తున్న ముత్యాల రాజేష్



ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలో గల చెర్లోపాలెం ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇక్కడ అమలు చేస్తున్న వివిధ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డ్స్‌లో నమోదు చేసిన వివరాలకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డేటాకు సరిపోయిందా లేదా అనే వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎ.రామచంద్రరావు, డేటా మేనేజర్ వై.జనార్ధన్ ఎంపీహెచ్‌ఈవో గుర్రం శ్రీనివాసరావు, హెచ్‌వి బేగం, ఎఎన్ఎం.కృష్ణవేణి, మంగతల్లి, శారద, సంతోషికుమారి, ఎంఎల్‌హెచ్‌పి.ఆర్.దేవి, కళావతి, కిన్నెర, ఆశాలు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : ఇఒపిఆర్‌డిగా బంగారి సత్యనారాయణ బుధవారం మండల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. సత్యనారాయణ నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీలో ఈవోగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇఒపిఆర్‌డిగా ఇక్కడికు వచ్చారు. ఈ సందర్భంగా అన్ని గ్రామల సచివాలయాల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసారు. గ్రామాల్లో శానిటేషన్ విషయంలో ఎటువంటి లోపాలు కనిపించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శక్తి యాప్, వారియర్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శక్తి వారియర్స్ గ్రూప్‌లపై అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు ముందుగా సదస్సును ప్రారంభించి శక్తి వారియర్స్ గ్రూప్స్ ఏర్పాటుపై తగిన అవగాహన కల్పించారు. డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ శక్తి యాప్ ద్వారా లైవ్ లొకేషన్ తెలుస్తుందని, తద్వారా మహిళలపై జరిగే అకృత్యాలను అరికట్టవచ్చని తెలిపారు. కళాశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగనీయకుండా ఈ వారియర్ గ్రూప్స్ ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ, కళాశాల సూపరింటెండెంట్ పి.అనురాధ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ జె.సామ్రాజ్యం, జిఎంఎస్ కార్యదర్శి స్వరూప, మహిళా ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలు నాటివేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి సంపద తయారీ కేంద్రం వద్ద కొబ్బరి మొక్కలను స్థానిక సర్పంచ్ పెడిరెడ్ల మాణిక్యం, ఎంపీటీసీ గొంపా వెంకటేశ్వరరాజు బుధవారం నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణమ్మ, విఆర్‌పి జి.వరాహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం అవస్థలు

దేవరాపల్లి రైతు సేవా కేంద్రం వద్ద క్యూ


దేవరాపల్లి రైతు సేవా కేంద్రానికి పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఖరీఫ్ వరి సాగులో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మండుటెండలో పనులు వదిలేసి ఎరువుల బస్తా కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడుతున్నారు. దేవరాపల్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం ఉదయం యూరియా విక్రయం జరుగుతుందన్న సమాచారం తెలిసిన వెంటనే రైతులు తెల్లవారు జామునే లైన్లో నిలబడ్డారు. ఒక్కొక్కరికి ఒక్క బస్తా మాత్రమే ఇస్తామని సిబ్బంది చెప్పడంతో ఆధార్, 1బి కోసం పరుగులు పెట్టాల్సి వచ్చింది. దీంతో ఒక దశలో గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని రైతులను శాంతింపజేసి క్యూలైన్లో అందరికీ యూరియా అందేలా చర్యలు చేపట్టారు. ఈసారి 267 బస్తాలు (12 టన్నులు) మాత్రమే రాగా, తమకు దొరకదేమోనన్న ఆందోళనతో రైతులు మండుటెండను లెక్కచేయకుండా గంటల తరబడి నిలబడి బస్తా దక్కించుకున్నారు. ఇంతకు ముందు ఎప్పుడూ యూరియా కోసం ఇలాంటివి జరగలేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం మరో రెండు మూడు రోజుల్లో మరిన్ని బస్తాలు వచ్చే అవకాశం ఉందని, ఆందోళన చెందవద్దని రైతులకు హామీ ఇస్తున్నారు.

విద్యార్థులకు యూనిఫారం అందజేత

ప్రజాశక్తి కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

'అందని యూనిఫామ్, పుస్తకాలు' దిబ్బిడి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఎదురుచూపులు శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురించిన కథనానికి బుచ్చయ్యపేట మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందలేదని విషయాన్ని ప్రచురించడంతో, ఎంఇఒ అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ఎంఇఒ బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు బుధవారం దిబ్బిడి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. సమీప పాఠశాలలో విద్యార్థులకు సరఫరా చేయగా మిగిలి ఉన్న యూనిఫామ్‌ను సేకరించి దిబ్బడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.అచ్చం నాయుడుకు అందజేశారు. పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పూర్తిగా అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంఇఒ తెలిపారు. విద్యార్థులకు యూనిఫామ్ అందజేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు స్కూల్ కమిటీ చైర్మన్ మండపాక శివ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


హెచ్‌ఎంకు యూనిఫామ్స్ అందిస్తున్న ఎంఇఒ

కుక్కల బారి నుండి రక్షించాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ప్రజలను కుక్కల బారి నుంచి రక్షించాలని కోరుతూ స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బల్లానాగభూషణం మాట్లాడుతూ అనకాపల్లి పట్టణం, జిల్లాలో పిచ్చి కుక్కలు, వీధి కుక్కల బారిన పడి పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్క కాటుకు గురై రేబిస్ వ్యాధికు గురై మరణించి సంఘటనలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేషగుప్తా, పట్నాల కృష్ణమోహన్, కొత్తూర్తి రామారావు, అయ్యవరం రమణమూర్తి, దువ్వార నేతాజీ, వి.సత్యారావు పాల్గొన్నారు.

అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు

- సెలవుపై వెళ్లిన అనకాపల్లి తహశీల్దారు
- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి



తహశీల్దారు అప్పారావు

రాజకీయ ఒత్తిళ్లు తాళలేక అనకాపల్లి తహశీల్దారు ఆగస్టు 28న సెలవు పెట్టి వెళ్లిపోవడంతో తహశీల్దారు కార్యాలయానికి వచ్చే ప్రజలు, సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నెల రోజులుగా డిప్యూటీ తహశీల్దారు కూడా లేకపోవడం, వారం రోజులైనా కనీసం ఇన్‌ఛార్జి తహశీల్దారును కూడా నియమించకపోవడంతో ప్రజల బాధలు వర్ణనాతీతం.

జిల్లా కేంద్రం అనకాపల్లి మండల తహశీల్దారుగా ఎంబి.అప్పారావు జూన్ 6న నియమితులయ్యారు. రాజకీయ కాణాచిగా పేరొందిన అనకాపల్లిలో విధులు నిర్వహించడం కష్టమని భావించి బాధ్యతలు స్వీకరించకుండా 37 రోజులు ఆయన నిరీక్షించారు. మరొక చోట పోస్టింగ్ లేకపోవడంతో విధి లేని నిస్సహాయ పరిస్థితిల్లో జులై 17న అనకాపల్లి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల హుంకరింపులు, బెదిరింపులు తట్టుకోలేక ఆయన సెలవు పెట్టి వెళ్లినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి అధికార పదవిని అనుభవిస్తూ టిడిపిలో క్రియాశీలకంగా ఉన్న అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే భూముల పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్‌లకు సంబంధించి తాను చెప్పిన పనులు చేయాలని తహశీల్దార్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే చేస్తామని తహశీల్దార్ అప్పారావు తేల్చి చెప్పడంతో సదరు మాజీ ఎమ్మెల్యే ఆగ్రహంతో నానా దుర్భాషలాడినట్లు సమాచారం. అలాగే ప్రస్తుతం టిడిపి విశాఖపట్నం జిల్లా స్థాయి పదవిని అనుభవిస్తున్న సబ్బవరానికి చెందిన పరవాడ మాజీ ఎమ్మెల్యే అనకాపల్లి మండలంలోని కోడూరు గ్రామంలో లే అవుట్ నెంబర్ 4కు సంబంధించి రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన లబ్ధిదారుల జాబితాలో తాను చేసిన సిఫార్సులు పొందుపరచాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. నిబంధనలకు అనుగుణంగా ఉంటే చేస్తామని, లేదంటే కుదరదని తహశీల్దార్ కరాఖండిగా తోసిపుచ్చడంతో సదరు పరవాడ మాజీ ఎమ్మెల్యే కాస్త ఆగ్రహంతో ఊగిపోయి నీ అంతు చూస్తా, చేయలేకపోతే సెలవు పెట్టేసి వెళ్లిపో అంటూ ధ్వజమెత్తినట్లు తెలిసింది. దీనికి కలత చెందిన తహశీల్దార్ అప్పారావు ఎందుకొచ్చిన గొడవ, రావడమే భయంతో వచ్చాను, ఇక్కడ నుంచి పోవడం శ్రేయస్కరమని ఆయన సన్నిహితుల వద్ద బోరున విలపించినట్లు సమాచారం.

అవస్థలు పడుతున్న ప్రజలు

నెల రోజులు క్రితం అనకాపల్లి డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమారస్వామి కొద్ది రోజులకే రాజకీయ నేతల తాకిడి తట్టుకోలేక బదిలీ ప్రయత్నాలు చేసుకొని అడహాక్ తహశీల్దార్‌గా పాడేరుకు బదిలీపై వెళ్లిపోయారు. నాటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. సోమవారం కొత్త డిప్యూటీ తహశీల్దార్ నియమితులయ్యారు. వారం రోజులుగా తహశీల్దార్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భూ సమస్యలు, రికార్డు ఆఫ్ రైట్స్ కాపీలు, పాస్‌బుక్‌లు, కుల, ఆదాయ, వారసత్వం మొదలగు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో ఆటంకాలు ఏర్పడ్డాయి. కొత్త భూ సర్వేలకు సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ అనంతరం మ్యూటేషన్ ప్రక్రియ ఆగిపోయింది. అధికారులు లేకపోవడంతో మధ్యస్థాయి సిబ్బంది ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చి నిరాశతో వెనుతిరిగి వెళ్లాల్సి వస్తోంది. తహశీల్దార్ లేకపోవడంతో స్థానిక సమస్యలు, పిజిఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి. తక్షణం అనకాపల్లి మండల తహశీల్దార్‌ను నియమించాలని ఆర్టీఐ, వినియోగదారుల రక్షణ చట్టాల ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.



రోడ్డు మధ్యలో మదుము వద్ద పడిన రంధ్రం

రోడ్డు మధ్యలో రంధ్రం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని బిఎన్ రోడ్డులో ఎల్.సింగవరం వద్ద గల మదంపై పెద్ద రంధ్రం పడింది. రంధ్రం ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారుల ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాలలో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ రంధ్రంలో హెచ్చరికగా చెట్టు కొమ్మలను ఏర్పాటు చేశారు. ఒకవైపు ఈ రోడ్డు మరమ్మతులకు గురికావడంతో వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే రంధ్రం పూడ్చాలని కోరుతున్నారు.

విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తనపై విచారణ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జెడ్పీ ఉన్నత పాఠశాలలో అనధికార వ్యక్తి తిష్ట వేసి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలపై ఎలమంచిలి డివిజన్ డిప్యూటీ డీఈవో అప్పారావు బుధవారం విచారణ చేశారు. పాఠశాలకు విచ్చేసిన డిప్యూటీ డిఇఒ విద్యార్థినులు, ఉపాధ్యాయులు, హెచ్ఎం ప్రసన్నకళ నుండి రాతపూర్వకంగా సమాచారం తీసుకున్నారు. పూర్వపు హెచ్ఎం శేషుబాబు చార్జి ఇవ్వకపోవడంపై విచారణ చేస్తామని తెలిపారు. టిడిపి టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్ హైస్కూల్ పరిస్థితులపై డిప్యూటీ డిఈఓకి వివరించారు. నిధులు ఉన్నప్పటికీ మరుగుదొడ్లు నిర్మించలేదని, నాడు-నేడులో వచ్చిన ఎలక్ట్రికల్ సామగ్రి, సిమెంట్ బస్తాలు నిరుపయోగంగా ఉన్నాయని, దీనిపై పూర్తి విచారణ చేయాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఈఓ మాట్లాడుతూ అన్ని విషయాలను పరిశీలించి పూర్తి నివేదికను డీఈవో సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ పాల్గొన్నారు. కాగా ఇప్పటికే డీఈవో అప్పారావు నాయుడు వడ్డాది హెచ్ఎం ప్రసన్నకళకి మెమో జారీ చేశారు.

అన్నవరం, నీలిగుంట రోడ్లకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని అన్నవరం, నీలిగుంట రోడ్డులకు నాబార్డ్ ఐఐఐ నిధుల నుండి 2.90 కోట్లు మంజూరైనట్లు డివిజనల్ ఇంజనీర్ కుమార్ రాజా తెలిపారు. ఎండపల్లి వయా అన్నవరం మీదుగా వేములపూడి వరకు 1.35 కోట్లతోనూ, వెంకటాపురం రోడ్డు నుండి వయా సన్యాసిరాజుపాలెం మీదుగా నీలిగుంట వరకు 1.45 కోట్లతో తారురోడ్లు మంజూరైనట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి సంధ్యారాణి తెలిపారు. బుధవారం మండలంలోని పెదపూడి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని అరట్లకోటలో రైతులకు కూటమి పార్టీల నాయకులు బుధవారం యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టా శ్రీను, తుమ్మల గణేష్, మాజీ ఎంపిటిసి గర్లంక చంద్రం, తుమ్మల బాబ్జి, తుమ్మల నూకరాజు, రైతులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

ఉపాధి హామీ కూలీలకు


12 వారాల వేతన బకాయిలు చెల్లించాలి



పని ప్రదేశంలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలో ఉపాధి హామీ కార్మికులకు 12వారాలు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో బొద్దపువానిపాలెం గ్రామంలోని పని ప్రదేశంలో ఉపాధి హామీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 12వారాల నుండి కూలి డబ్బులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్ధాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయలు కల్పించాలని, పనిముట్లు, వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఉపసంహరించుకోవాలని కోరారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన రూ.309 రోజు వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

గ్రామీణ మత్స్యకారుల అభివృద్ధికి కృషి



మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలపై ఆధారపడే మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని రొంగలి నాయుడుపాలెంలో శ్రీరామ స్వదేశీ మత్స్యకార సహకార సంఘానికి యాజమాన్య ఖర్చులు నిమిత్తం మంజూరైన రూ.2.54 లక్షల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో పెంచుకుంటున్న చేపలను దళారులకు ఇవ్వకుండా నేరుగా అమ్ముకోవాలని సూచించారు. విశాఖ నగరంలో అమ్ముకునే విధంగా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతానని చెప్పారు. ముందుగా సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బేరా శ్రీను, బేరా రాము ఎమ్మెల్యే బండారును ఘనంగా సత్కరించారు. కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు జూరెడ్డి రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార అభివృద్ధి అధికారి టి.నాగమణి, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, నాయకులు సబ్బవరపు రామునాయుడు, బండారు నరసింహనాయుడు, పూడి నారాయణమూర్తి, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదలపై హర్షం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : పెండింగ్ బకాయిలు చెల్లించినందుకు కూటమి ప్రభుత్వానికి ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ తరుపున ఉపాధ్యక్షులు వినోద్ రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విజయవాడ సెక్రెటరీ ఏరియావద్ద ధన్యవాదాలు తెలపడానికి వెళ్లి మీడియతో మాట్లాడారు. 15 ఆర్థిక సంఘం బకాయి నిధులు 2024-25 ఆర్థిక సంవత్సరం రూ.1920 కోట్లు మంగళవారం సర్పంచ్, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లోని జమ చేయడం చేసినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ స్ఫూర్తితో రానున్న రోజుల్లో కూడా ప్రభుత్వంతో కలిసి అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు.

జిఒ 146ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామీణ పేదలకు ఇచ్చిన ప్రభుత్వ బంజరు భూములను స్వాధీనం చేసుకోవడానికి ఉద్దేశించి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 146ను తక్షణమే రద్దు చేయాలని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిఎస్.అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో గత ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో పెద్ద ఎత్తున దళితులు, బహుజనుల చేతుల్లో ఉన్న డి.పట్టా భూములను స్వాధీనం చేసుకుందని తెలిపారు. డి.పట్టా ఉన్నవారికి 900 చదరపు గజాలు, లేనివారికి 450 చదరపు గజాలు చొప్పున వాణిజ్య స్థలాలుగా మార్చి, పూర్తి జిరాయితీ హక్కులతో ఇస్తామని నాటి ప్రభుత్వం చెప్పినా నేటికీ ఇవ్వలేదన్నారు. ల్యాండ్ పూలింగ్‌కు గత జగన్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 72ను తిరగదోడి, అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 1940 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా స్వాధీనం చేసుకోవడం కోసం ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం జులై 30వ తేదీన జీవో 146 విడుదల చేసిందని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలను ఎన్నికల సమయంలో ప్రచారాస్త్రంగా వాడుకుని గద్దెనెక్కిన తర్వాత అదే జీవో నెంబరును మార్చి ఇవ్వడం ప్రజలను మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వంలోని నాయకులు లబ్ధి పొందడం కోసమే తిరిగి ల్యాండ్ పూలింగ్‌ను తీసుకొచ్చారని విమర్శించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక స్వయంభు విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా చోడవరం సిహెచ్ఎంసి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతిరోజూ ఆలయానికి వస్తున్న భక్తులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శ్యామల, ఆశా కార్యకర్త బి.రామలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వెంకటాపురం సబ్ స్టేషన్ మెయింటినెన్స్, 33 కెవి ట్రీ కటింగ్ కారణంగా ఈనెల 5వ తేదీన సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, గవర్ల అనకాపల్లి, తోటాడ, సిరసపల్లి, మూలపేట, రామారాయుడు పేట, చిన్నవాని పాలెం, తానాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటన తెలియజేశారు. ఆ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

అనకాపల్లి : ఆర్డీఎస్ఎస్ బ్రేకర్ పనుల కారణంగా తుమ్మపాల సెక్షన్, 33/11 కెవి అల్లికానుడిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలలో ఈనెల 5న ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు 24 గంటల వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో కోరారు.

వివాహితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

• సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు • నిర్వాసిత మహిళలతో కలిసి నిరసన, వినతి



సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న నిర్వాసిత వివాహిత మహిళలు

ప్రజాశక్తి -నక్కపల్లి :వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణలో ఇళ్లు కోల్పోయిన కుటుంబాల్లోని వివాహితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద చందనాడ పంచాయతీ తుమ్మలపేట గ్రామానికి చెందిన వివాహితులు, వారి తల్లిదండ్రులతో కలిసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. వివాహమైన ఆడపిల్లలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ తహసిల్దార్ నరసింహ మూర్తికి వినతిపత్రం అందజేశారు. సంఘీభావం తెలిపి, ఆందోళనలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ 2016లో భూసేకరణకు సంబంధించి అవార్డు ప్రకటించారని, నాటి నుండి నేటి వరకు వివాహమైన ఆడపిల్లలందరికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

భూసేకరణలో వివాహమైన ఆడపిల్లలకూ ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని, డి ఫారం, సాగు భూముల్లో చెట్లు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లిస్తామని, ఆర్ కార్డులు ఇచ్చి అందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఆనాడు అధికారులు గ్రామ సభలు నిర్వహించి హామీలు ఇచ్చి భూసేకరణ చేపట్టారన్నారు. ఇపుడు ఇచ్చిన మాటను అమలు చేయకుండా నిర్వాసితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న అధికారులు, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులకు మొండిచేయి చూపించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఆర్అండ్ఆర్ అధికారి వివి రమణ తగురీతిలో స్పందించి, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యు. రమేష్ ,పి. వాణి, టి. వెంకటలక్ష్మి, పి. శ్రీదేవి ,ఎం. నాగదుర్గ, వి. నాగసత్య, ఎం. కుమారి, ఎస్. నూకరత్నం, పి .సూర్యావతి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత



ఆర్థిక సహాయం చేస్తున్న అఖండ సేవా సంస్థ సభ్యులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాతవరం ఎంబి పట్నం గ్రామానికి చెందిన అనపర్తి సాయి కుటుంబానికి నర్సీపట్నం అఖండ సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సంస్థ ప్రతినిధులు, రూ.27 వేల ఆర్థిక సహాయం అందించారు.కార్యక్రమంలో బిజెపి నేత బోలెం శివ, సంస్థ సభ్యులు రఘు, దయాకర్, చైతన్య, సురేష్ పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ లోని పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా భద్రత, సామాజిక స్పృహ పెంపు లక్ష్యంగా బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయానికి శక్తి యాప్ వినియోగం,. శక్తి వారియర్ టీమ్స్ సహకారం, పని తీరుపై అవగాహన కల్పించారు. మహిళలపై వేధింపులు, అకృత్యాలు నివారణ, వారి సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ చర్యల ప్రాముఖ్యత మాదక ద్రవ్యాల నిరోధక చర్యలు, డ్రగ్స్ వల్ల యువత, విద్యార్థులకు కలిగే అనర్థాలపై వివరించారు. మహిళలకు ఆపద సమయంలో సహాయ కేంద్రాలను వినియోగించు కోవాలని, హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఎలా వినియోగించు కోవాలో వివరించారు

ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. అంతకుముందు ఇటీవలే దేవాదాయశాఖ నుంచి ఆలయ కమిటీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించిన వెంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీని ఇఒ సాంబశివరావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం పాలకమండలి ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీని మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ అభినందించి, కండువాలు వేసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. పాలకమండలిని అందరికీ పరిచయం చేశారు.

ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో దేవాదాయశాఖ నుంచి పట్టణంలోని పలు దేవాలయాలను ఆలయ కమిటీలకు అప్పగించేలా చర్యలు తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.ఐదు లక్షల లోపు ఆదాయమున్నఆలయాలను కూడా దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చడం ద్వారా ఆలయాలు అభివృద్ధి చెందకుండా వైసిపి ప్రభుత్వం మోకాలడ్డిందన్నారు. నర్సీపట్నం ఐదు రోడ్ల జంక్షన్‌లోని బాల వినాయకుని ఆలయం, మరిడమ్మ ఆలయం, షిర్డీ సాయిబాబా ఆలయాలను దేవాదాయ శాఖ ఇలా విలీనం చేయడం వల్లే వాటి ఆలనాపాలనా పట్టించుకునే దిక్కు లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిని దేవాదాయ శాఖ పరిధి నుంచి తొలగించారన్నారు. ఆలయ కమిటీలలో అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేశామని, ఇకనుంచిఉత్సవాలు, పండుగలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ బ్రహ్మలింగస్వామి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రుత్తల కృష్ణ, రావణపల్లి ఆవ్ చైర్మన్ రాజేశ్వరరావు, నూకాంబిక ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాసరావు, కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు, డబ్బీరు శ్రీకాంత్, జనసేన పార్టీ పంచడ హరినాథ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యుత్ వైర్ల సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఎఎల్.పురం పోలీస్‌స్టేషన్ ఎదుట ఏళ్ల తరబడి ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు మేరకు ఎంపిపి గజ్జలపు మణికుమారి స్పందించి, మండల పరిషత్ అభివృద్ధి నిధుల నుంచి రూ.86వేలను కేటాయించడంతో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ స్తంభాల వైర్లను స్తంభాల నుండి తొలగించి, 33 కెవి విద్యుత్ స్తంభానికి మార్పు చేశారు. దీంతోకాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణి కుమారి, విద్యుత్ శాఖ ఎఇఇ రాజేంద్రకుమార్, ఎంపిటిసి చింతల బుల్లి ప్రసాదు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లి 6వ అంగన్వాడీ కేంద్రంలో లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కర్రి రాంగోపాల్ అధ్యక్షతన కార్యక్రమంలో ఆర్‌సి ఇందిరా మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం జ్ఞాపకశక్తి పెరుగుదల, చురుకుదనానికి పోషక విలువలతో కూడిన ఆహారం తప్పనిసరి అన్నారు. లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు వెలగా నారాయణరావు మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహార ఉత్పత్తులను అందించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బేతిరెడ్డి విజయ్ కుమార్, వికాస్ సతీష్, గొలుసు శ్రీను, మహారాజ చందు, ఊడి అప్పారావు, ఎన్ఎపి సతీష్, శంకర్‌లాల్, హర్షవర్ధన్, లావణ్య, అంగన్వాడీ టీచర్ రత్నం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మంచి ఆరోగ్యానికి సమతుల ఆహారం ముఖ్యమని మాక్స్ హెల్త్‌కేర్ రీజనల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్ రితికా సమద్దార్, న్యూట్రిషన్, వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి, ఆయుర్వేద నిపుణురాలు మధుమిత కృష్ణన్ అన్నారు. పోషకాహార మాసాన్ని పురస్కరించుకొని 'సమతుల ఆహారం - సంపూర్ణ ఆరోగ్యం' అంశంపై నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన అవగాహనా సదస్సులో వారు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : సమత కళాశాలలో ఆరోగ్యం, పోషకాహార విలువలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. చీఫ్ డైటీషియన్ పంచకర్ల సాయి సింధూర, కళాశాల డీన్ అండ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎస్.విజయ రవీంద్ర పాల్గొన్నారు. న్యూట్రిషన్ విద్యార్థులు వివిధ పోషకాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కోటవురట్ల : పౌష్టికాహార మాసోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో సంతబయలు వద్ద గల అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార ఎగ్జిబిషన్ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ బుల్లిబాబు, పలువురు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయ నీరు విడుదల



రిజర్వాయర్ నుండి దిగువకు విడుదలవుతున్న నీరు

ప్రజాశక్తి-మాడుగుల : మండలంలోని పెద్దేరు జలాశయంలో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరడంతో నీటికి దిగువకు విడుదల చేస్తున్నట్లు పర్యవేక్షణాధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. జలాశయ గరిష్ట నీటి మట్టం 137.00మీటర్లు కాగా, ప్రస్తుతం 136.35 మీటర్ల నీరుచేరడంతోపాటు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 498 క్యూసెక్కులు నీరు జలాశయంలోకి వచ్చిచేరుతుండడంతో స్పిల్‌వే మూడవ గేటు ద్వారా 250 క్యూసెక్కులు, రాచకట్టనుండి 20 క్యూసెక్కులు, ఆర్ఎంసి నుండి మరో 40 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. జలాశయం దిగువన నదీ పరివాహక ప్రాంతం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి : ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపిడిఒ డి సీతారామరాజు అన్నారు. బుధవారం గొడిచెర్ల పిహెచ్‌సిని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు. మందుల స్టాక్, పాము, కుక్కకాటు వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా ముందస్తుగా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. పిహెచ్‌సిలోని మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు, అల్లు రమణ, మాజీ వైస్ ఎంపిపి వైబోయిన రమణ పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

- జిల్లా వ్యవసాయాధికారి బి మోహనరావు

ప్రజాశక్తి -నక్కపల్లి : మోతాదుకు మించి ఎరువులు వాడకం వల్ల పంటలకు శ్రేయస్కరం కాదని జిల్లా వ్యవసాయాధికారి బి మోహనరావు రైతులకు సూచించారు.బుధవారం మండలంలో ఉపమాక గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది'కార్యక్రమంలో మాట్లాడుతూ, నక్కపల్లి మండలానికి 216 మెట్రిక్ టన్నులు యూరియా ఇచ్చామన్నారు. రైతు సేవ కేంద్రాల ద్వారా 60 టన్నులు యూరియా రైతులకు పంపిణీ చేశామన్నారు. మరో 2 రోజుల్లో 48 టన్నుల యూరియా రానుందన్నారు. ఇంతే కాకుండా మరో 72 మెట్రిక్ టన్నుల యూరియాకు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయవిధానంలో సాగుతో ఆరోగ్యకరమైన పంట దిగుబడులతోపాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రసాయన ఎరువులు పురుగుమందులు వాడాలన్నారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎఒ ఉమా ప్రసాద్ మాట్లాడుతూ నానో ఎరువుల వాడకంపై వివరించారు. శతశాతం రాయితీపై రైతులకు అపరాల సంచులు అందజేశారు కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, ఎఇఒలు సత్యనారాయణ, సాయికుమారి, విఎఎలు రవి,ధనరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తాసు బాబు, అప్పారావు, భవాని పాల్గొన్నారు.

ఎరువుల అక్రమ నిల్వలను ఉపేక్షించం

ప్రజాశక్తి నర్సీపట్నం : మోతాదుకు మించి ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచితే ఉపేక్షించేది లేదని విజిలెన్స్ అధికారి నాయక్ అన్నారు.బుధవారం నర్సీపట్నం ప్రాంతంలో పలు ఎరువుల దుకాణాలను, గోదాములను పరిశీలించారు, ఈ సందర్భంగా నర్సీపట్నం సత్యనారాయణ స్టోర్స్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించారు, ఈ ందర్భంగా నర్సీపట్నం వ్యవసాయాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ, అధిక ధరలకు ఎరువులు అమ్మినా, అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు, ప్రైవేటు షాపుల్లో పరిమితికి మించి ఎరువులు అమ్మరాదని సూచించారు.

ఇళ్ల బిల్లులు చెల్లించాలని నిరసన


పునాదులపై నిరసన తెలియజేస్తున్న గిరిజన లబ్ధిదారులు

ప్రజాశక్తి-రోలుగుంట : ఎన్‌టిఆర్‌గృహనిర్మాణ పథకంలో చేపట్టిన ఇళ్ల బిల్లులు చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అర్ల పంచాయతీ పెదగరువు, పిత్రిగెడ్డ ఆదివాసీ గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ ఆయాగ్రామాల్లో పది మంది ఆదివాసీ గిరిజనులు 2022లో జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరయ్యాయని, సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అప్పట్లో ఇళ్లను నిర్మించుకోలేక పోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు బేస్‌మెంట్ లెవెల్ వరకు పూర్తిచేశారన్నారు. గతంలో పునాదుల స్థాయి ఇళ్ల నిర్మాణాలకు రూ..70వేలు బిల్లుతోపాటు ఉపాధి పథకం ద్వారా 28 పని దినాలుగ గుర్తించి రూ. 8054 ఉపాధి వేతనం ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం బేస్‌మెంట్‌కు రూ. 52వేలు మాత్రమే ఇస్తుందన్నారు. మరో రూ.20వేలు సన్‌సైడ్ లెవెల్‌కు వేస్తామని చెబుతున్నారన్నారు. అప్పులు చేసి గిరిజనులుఇళ్ల నిర్మాణలను చేపడుతున్న నేపథ్యంలో వారి పనులను కొనసాగించాలంటే తక్షణమే బేస్‌మెంట్ కింద రూ.70వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ధ్రువీకరణలతో పిఇటి ఉద్యోగాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మెగా డిఎస్‌సి 2025లో తప్పుడు ధ్రువపత్రాలతో పిఇటి ఉద్యోగాలు పొందిన కొంతమంది అభ్యర్థుల నియామకాలను నిలుపుదల చేయాలని ప్రజా సంకల్ప వేదిక, రాష్ట్ర ఆర్‌టిఐ అధ్యక్షులు జక్కు నరసింహామూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నర్సీపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఒక వరమైన మెగా డిఎస్‌సిని కొంతమంది అభ్యర్థులు తప్పుడు ధ్రువపత్రాలతో ప్రభుత్వాన్ని మోసం చేసి, నిజాయితీగా కష్టపడి చదువుకున్న వారికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఇటి ఉద్యోగాలకు రెండేళ్ల బిపిఇడి కోర్సు అవసరం కాగా, కొంతమంది కెజిబివిల్లో ఉద్యోగాలు చేస్తూ బిపిఇడి శిక్షణ పూర్తి చేసినట్లు తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగాలు సంపాదించారని ఆరోపించారు. దీనిపై సమగ్ర పరిశీలన జరిపాలని, అంతవరకు ఉద్యోగ నియామకాలను నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిజమైన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, డిఇఒ, డిఎస్‌సి 2025 కన్వీనర్, ప్రత్యేక విద్యాశాఖ కమిషనర్లకు ఫిర్యాదు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా గోపీనాథ్


డిజె.నాథ్

ప్రజాశక్తి -నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా పిఆర్‌టియు అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్‌ను ఎంపిక చేయడంపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. నర్సీపట్నం శివపురం వద్ద మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గోపీనాథ్, ఉపాధ్యాయునిగా తన వృత్తిధర్మాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఉపాధ్యాయ సంఘం నాయకునిగా విద్య, ఉపాధ్యాయ సమస్యలపై తనవంతు కృషి చేస్తూ రెండు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసిందని పలువురు అంటున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన గోపీనాథ్‌ను తోటి ఉపాధ్యాయులతో స్థానికులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.





కొనసాగుతున్న దళిత రైతుల దీక్షలు


ఒంటికాలిపై నిరసన వ్యక్తం చేస్తున్న దళిత రైతులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : రాళ్ల క్వారీని రద్దు చేయాలని నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మాకవరపాలెం మండలం జి కోడూరు దళిత రైతులు చేస్తున్న రిలేదీక్షలు 43 రోజుకు చేరుకున్నాయి. బుధవారం ఒంటికాలిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు మాట్లాడుతూ దగా పడ్డ దళిత రైతులు 43 రోజులుగా పనులు మానేసి, పిల్లా పాపలతో, రిలేదీక్షలు చేస్తుంటే, ఓట్లేసి గెలిపించిన నేతలుగానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే రాళ్ళ క్వారీని రద్దు చేయకపోతే, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అప్పారావు, పెంటయ్య, లోవరాజు, చిరంజీవి, నాగభూషణం, సతీష్, గణేష్ పాల్గొన్నారు.



సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

పట్టణంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-చోడవరం : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా 13వ మహాసభలు ఈనెల 6, 7 తేదీల్లో చోడవరం గంగా ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం చోడవరం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ముఠా కళాసీలను, టైల్స్ ముఠా జట్లు, వివిధ సంఘాల నాయకులను కలిసి మహాసభలు జయప్రదానికై కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాసభలో గత మూడేళ్ల కాలంలో జిల్లాలో నిర్వహించిన కార్మిక పోరాటాలు, ఉద్యమాలను సమీక్ష చేసుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని, నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని చెప్పారు. చోడవరం ప్రాంతంలో సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. చోడవరంలో జరుగుతున్న ఈ మహాసభలు భవిష్యత్ పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్వీ నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, వెంకట్రావు, ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.


కళాసీలను కలిసి ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

మానవ సమాజాభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం మార్గదర్శకం



ప్రయోగాలతో విద్యార్థులకు వివరిస్తున్న సైన్స్ ప్రచారకుడు శివ గణేష్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మానవ సమాజం అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం మార్గదర్శకంగా నిలుస్తుందని జన విజ్ఞాన వేదిక సైన్స్ ప్రచారకుడు రాయపాటి శివగణేశ్ అన్నారు. మూఢనమ్మకాలు సమాజం వెనుకబాటుతనానికి దారితీస్తాయని పేర్కొన్నారు. దేవరాపల్లిలోని కైరళీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లో కాస్ట్, నో కాస్ట్ అంశంపై ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాల వర్క్ షాప్‌లో ఆయన శాస్త్రీయ అవగాహన కల్పించారు. ప్రజల విశ్వాసాలను దోపిడీకి వాడుకుంటూ, మంత్రాలు, మాయలు పేరిట ఏ విధంగా మోసం చేస్తున్నారో పలు ప్రయోగాలతో విద్యార్థులకు తెలియజేశారు. శాస్త్రీయ దృక్పథం ఉంటే ఎలాంటి మహిమలనూ మోసగాళ్లు చూపలేరని స్పష్టం చేశారు. అద్భుతాల పేరుతో మోసపోకుండా, ప్రతిదానిని సైన్స్ కోణంలో అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను ఆకట్టుకున్న శాస్త్ర ప్రయోగాలు వారిలో శాస్త్రజిజ్ఞాసను రేకెత్తించాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు, ఎంఇఒ, ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం ఉమా, కైరళీ పాఠశాల కరెస్పాండెంట్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్ నియమించాలి

ప్రజాశక్తి-సబ్బవరం

ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులలో ఉద్యోగోన్నతులు కల్పించాలని మండల పరిషత్ పరిపాలనాధికారి కెఎస్‌పి.నారాయణరావు డిమాండ్ చేశారు. ఏపీజిఈఏ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం" అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీజిఈఏ జిల్లా పూర్వ అధ్యక్షులు షేక్ బాబురావు మాట్లాడుతూ పెన్షనర్స్‌కు రావలసిన బకాయి, డిఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.